





క్రిస్మస్ కాంతులు

జిల్లాలో క్రిస్మస్ సందడి మొదలైంది. మార్కెట్‌లో క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ జోరుగా బొమ్మలను విక్రయిస్తున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిద్దిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చిని ఇలా రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)





దేవాదుల పనులకు
రూ.178 కోట్లు కేటాయించండి

- జనగామ ఎమ్మెల్యే 'పల్లా'

చేర్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకం జనగామ నియోజకవర్గంలోనే అధికభాగం ఉంటుందని కాలువల నిర్మాణానికి భూసేకరణ పూర్తిచేసేందుకు రూ.178కోట్లు నిధులు మంజూరు చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం ఆయన దేవాదుల పనులపై మాట్లాడారు. దేవాదుల ద్వారా జనగామ నియోజకవర్గంలో పలు రిజర్వాయర్ల నిర్మాణం జరిగిందని, కాలువల నిర్మాణానికి 3400 ఎకరాలకు 2972ఎకరాల భూసేకరణ చేసినట్లు చెప్పారు. మిగిలిన 499 ఎకరాలు ప్యాకేజీ-2లో 33 ఎకరాలు, ప్యాకేజీ-7లో 36 ఎకరాలు, ప్యాకేజీ-8లో 430 ఎకరాలు సేకరించాల్సి ఉందని, అందుకు రూ.178కోట్లు నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. గతంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందించానన్నారు. నియోజకవర్గంలో 484 చెరువులుంటాయని, అన్ని సమృద్ధిగా నిండాలంటే భూసేకరణతో పాటు నిధులు అందించాలన్నారు. తద్వారా పక్కనే ఉన్న ఆలేరు నియోజకవర్గానికి నీళ్లు అందుతాయన్నారు. ఇటీవల ఎత్తిపోతలు చేపట్టినప్పటికీ కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి జనగామ నియోజకవర్గ చెరువులు నింపకుండానే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన నియోజకవర్గానికి మొత్తం నీళ్లను తరలించుకుపోయారన్నారు. ధర్మసాగర్ నుంచి గండిరామారం మీదుగా తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపితే యాసంగికి సంబంధించి ఆయా చెరువులకు నీళ్లు అందుతాయని చెప్పారు. అందుకు సంబంధించిన వసతులున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. నాలుగు పంపులలో ఒకే పంపును సగంరోజు ఆన్‌చేస్తుండటంతో సరిపడా నీరు రావడం లేదన్నారు. నియోజకవర్గం పాటు పక్క నియోజకవర్గాల రైతుల కోసం అన్ని పంపులను ఆన్‌చేసి చెరువులను నింపాలని ఆయన కోరారు.

మాకేది రక్షణ..?

- మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై అధికారుల నిర్లక్ష్యం
- చలికాలంలో కనీస సౌకర్యాలు కల్పించని వైనం
- స్వెటర్లు, గ్లౌజులు, బూట్లు, సేఫ్టీ ఆప్రాన్లు లేక ఇబ్బందులు
- గజగజ వణుకుతూ పనులు చేస్తున్న కార్మికులు
- ఆదాయంలో ముందున్నా ఆదుకునేందుకు మున్సిపాలిటీల వెనుకంజ
- కార్మికుల ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్

ఆంధ్రజ్యోతి ఫోకస్

"సిద్దిపేట మున్సిపాలిటీలో 358 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా కాంట్రాక్టు ఉద్యోగులే. 20ఏళ్లుగా పనిచేస్తున్నా రూ.15వేల వేతనం దాటడం లేదు. చలి నుంచి రక్షణ కోసం కేవలం వీరికి రబ్బరు గ్లౌజులు మాత్రమే ఇచ్చారు. స్వెటర్లు, మంకీ క్యాపులు, బూట్లు ఇవ్వలేదు. పెద్ద పట్టణం కావడంతో అర్ధరాత్రి నుంచే పనుల్లోకి వెళ్తున్నారు. చలిని తట్టుకునేందుకు రెండు చొక్కాలు ధరించి గజగజ వణుకుతూ పనిచేస్తున్నారు."

"జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హుస్నాబాద్ మున్సిపాలిటీలో 113 మంది కార్మికులున్నారు. చెత్తను కుప్పగా ఊడ్చి తరలించడం, మురుగుకాలువలను శుభ్రం చేస్తుంటారు. వీరికి ఇప్పటిదాకా బూట్లు, స్వెటర్లు, మంకీ క్యాపులు ఇవ్వలేదు. ఇటీవల రేడియం స్టిక్కర్లతో కూడిన ఆప్రాన్లు ఇచ్చారు. చలిలో వణుకుతూ పనిచేయడం ఇబ్బందిగా ఉందని, మూడు నెలలుగా వేతనాలు కూడా ఇవ్వడం లేదని కార్మికులు వాపోతున్నారు."

"గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 107 మంది పారిశుధ్య కార్మికులున్నారు. చలి తీవ్రంగా ఉందని, ఎముకలు కొరికే చలిలోనే పట్టణాన్ని శుభ్రం చేస్తున్నామని కార్మికులు చెబుతున్నారు. ఇటీవలనే గ్లౌజులు మాత్రం ఇచ్చారు. స్వెటర్లు, బూట్లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. తమకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వచ్చే అరకొర వేతనం కూడా సరిపోడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబరు 19



బూట్లు, గ్లౌజులు లేకుండానే హుస్నాబాద్ పట్టణంలో చెత్తసేకరణలో నిమగ్నమైన కార్మికులు



సిద్దిపేటలో చలిలోనే రహదారులను శుభ్రం చేస్తున్న కార్మికులు

సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ మున్సిపాలిటీలతో పాటు చేర్యాల, దుబ్బాక మున్సిపాలిటీల్లోనూ పారిశుధ్య కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. కోడి కూయక ముందే పనుల్లో నిమగ్నమయ్యే కార్మికులపై కనీస చిత్తశుద్ధిని చూపించడంలో మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు విఫలమవుతున్నారు. ఇలాంటి కార్మికుల దుస్థితిపై గురువారం తెల్లవారుజామునే 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలన చేపట్టింది.

ఆదాయం ఫుల్... కార్మికులకు నిల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతోపాటు స్థానికంగా వసూలు చేస్తున్న పన్నులతో మున్సిపాలిటీలన్నీ ఆదాయ మార్గంలోనే నడుస్తున్నాయి. ఇక మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఛైర్మన్ పదవుల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న పరిస్థితి. అదే విధంగా కంప్యూటర్ ఆపరేటర్ నుంచి కమిషనర్ దాకా అన్ని పనుల్లోనూ తగిన ప్రాధాన్యత ఉండనే ఉంటుంది. కానీ పారిశుధ్య కార్మికుల వద్దకు వచ్చేసరికి దౌర్భాగ్యమైన పరిస్థితులు దాపురించాయి. కోట్లాది రూపాయల ఆదాయం ఉన్నా వీరికి కనీస సౌకర్యాలను కల్పించడంలో వెనుకంజ వేస్తున్నారు. స్వెటర్లు, బూట్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజులు సైతం సరఫరా చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

వణుకుతూనే ఊడుస్తూ.. తూడుస్తూ

పదిరోజులుగా సిద్దిపేట జిల్లాలో అత్యల్పస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా 7డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సాయంత్రం 5 గంటలు దాటితేనే ఇళ్లకు చేరుతున్న పరిస్థితి. మళ్లీ ఉదయం 9 గంటల తర్వాతనే కాలు బయటపెడుతున్నారు. పట్టపగలు కూడా చాలామంది స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించి కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున 4 గంటలకే వీధులన్నీ శుభ్రం చేయడానికి బయల్దేరుతున్న కార్మికుల పరిస్థితి నిజంగా ఆందోళనకరమే. చాలీచాలని వేతనాలతో స్వెటర్లు, గ్లౌజులు కొనుగోలు చేయలేక పాత చొక్కాలను స్వెటర్లు



రేడియం స్టిక్కర్లతో కూడిన ఆప్రాన్లు లేకుండా గజ్వేల్‌లో రహదారిపై పారిశుధ్య కార్మికుల చెత్తసేకరణ

మిగతా 8వ పేజీలో...



అవార్డు అందుకుంటున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్

స్వచ్ఛభారత్ మిషన్ 2.0లో
మెరిసిన సిద్దిపేట

- 'ద చేంజ్ మేకర్స్'లో ప్రతిభ కనబర్చిన మున్సిపాలిటీ
- ఢిల్లీలో అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్ మిషన్ 2.0లో భాగంగా న్యూఢిల్లీలో సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్‌మెంట్ ఎంవోహెచ్‌యూఏ (మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన "ద చేంజ్ మేకర్స్ 2022లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు సిద్దిపేట మున్సిపాలిటీకి అవార్డు దక్కింది. గురువారం న్యూఢిల్లీలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. న్యూఢిల్లీలో ద చేంజ్ మేకర్స్ కాంక్లేవ్ సదస్సులో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై 24 రాష్ట్రాల నుంచి వందమంది అధికారులకు ఆహ్వానం రాగా అందులో ప్యానల్ డిస్కషన్ సభ్యుడిగా అవకాశం లభించినట్లు తెలిపారు. సిద్దిపేటలో చెత్త సేకరణపై ప్యానల్ సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చినట్లు ఆయన వివరించారు. సిద్దిపేట పట్టణ ప్రజాప్రతినిధులు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజల సహకారంతో స్వచ్ఛ సిద్దిపేట దిశగా అడుగులు వేయగలిగామన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌కు అవార్డు 8

నాచగిరి లక్ష్మీనృసింహుడి హుండీ
ఆదాయం రూ. 16.84లక్షలు

వర్గల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గురువారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో చేపట్టిన హుండీ లెక్కింపులో 87 రోజులకు రూ.16,84,547 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.

సిద్దిపేటలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో సీపీ అనురాధ, పోలీసులు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో గురువారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో చేపట్టిన ఫ్లాగ్‌మార్చ్‌ను సీపీ అనురాధ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్ అంబేడ్కర్ చౌరస్తా, మెదక్‌రోడ్, ఇక్బాల్ మినార్, మోయిన్ పురా, భారీమాం చౌరస్తా, సుభాష్ రోడ్, రేణుకానగర్, ధోబీగల్లీ, నెహ్రూ పార్క్, నర్సాపూర్ చౌరస్తా, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, కరీంనగర్ రోడ్డు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించడం ఫ్లాగ్ మార్చ్ ముఖ్య ఉద్దేశమన్నారు. నేడు హుస్నాబాద్‌లో, 21న గజ్వేల్‌లో, 22న కొమురవెల్లి మండల కేంద్రంలోని టెంపుల్ ఆవరణలో, 23న దుబ్బాకలో, 24న సిద్దిపేట పట్టణం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ ఉంటుందన్నారు. కోమటి చెరువు, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి ప్రాజెక్టులు, ముఖ్యమైన ప్రదేశాలను సందర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ బగేల్, సిద్దిపేట ఏసీపీ మధు, ఆర్ఏఎఫ్ ఇన్‌స్పెక్టర్లు హరిబాబు, మల్లేశ్వరరావు, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది, 150 సిబ్బంది ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు.



సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

విద్యాశాఖలో
స్తంభించిన సేవలు!

- సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెతో తీవ్ర ప్రభావం
- ఎంఆర్‌సీల్లో నిలిచిన కార్యకలాపాలు
- కేజీబీవీ, భవిత కేంద్రాల్లో నిలిచిన బోధన
- కీలక సమయంలో చదువులకు ఆటంకం

7



ముగిసిన సీఎం కప్ క్రీడలు

- రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక
- మద్దూరు, హుస్నాబాద్ కబడ్డీ టీమ్‌ల మధ్య ఘర్షణ.. ఓ ఆటగాడి తలకు గాయం
- సర్దిచెప్పిన అధికారులు, పోలీసులు

8

పేరుకే బహిరంగ వేలం.. అంతా సిండికేట్!

- వేలం పాటలో అంత ఆ ఊరోళ్లే!
- ఈ సారైనా ఇతరులకు అవకాశం దక్కేనా?
- స్థానికత ముసుగులో బెదిరింపులు
- తగ్గుతున్న ఆలయ ఆదాయం



కొండపోచమ్మ ఆలయం

జగదేవ్‌పూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్‌లో ప్రసిద్ది గాంచిన పుణ్యక్షేత్రం కొండపోచమ్మ ఆలయం వద్ద ప్రతి సంవత్సరం బహిరంగ వేలం నిర్వహిస్తారు. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉండే దుకాణ సుముదాయాలు కొబ్బరికాయలు, కొబ్బరిచిప్పలు, ఒడిబియ్యం, లడ్డూ, ప్రసాదం, పాలు, పెరుగు, పూలపందిరి, విద్యుత్ దీపాల అలంకరణ, అమ్మవారి చీరలు తదితర ఆలయానికి చెందిన వాటికి వేలం నిర్వహించి పాట దక్కించుకున్న వారికి వాటిని నిర్వహించుకునే అవకాశం కల్పించాలి. అలాగే ఎవరు ఎక్కువ పాట పాడితే అధికారులు వారికే కేటాయించాలి. కానీ కొన్ని సంవత్సరాలుగా కేవలం కొన్నింటికే వేలంపాట నిర్వహించి మిగతా వాటిని మాత్రం తమకు నచ్చిన వ్యక్తులకు అప్పగిస్తున్నారు. రెండేళ్లుగా ఇతర ప్రాంతాల వారు టెండర్‌లో పాల్గొనడానికి ప్రయత్నం చేసి విఫలమయ్యారు. స్థానికేతరులు వస్తే వారిని బెదిరిస్తూ వేలంలో పాల్గొనకుండా చేస్తున్నారన్నారు. స్థానికులంతా సిండికేట్‌గా ఏర్పడి వారే టెండర్లు వేసి వేలం పాట పాడి వాటిని దక్కించుకుంటారు. అయితే సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారైనా టెండర్ ప్రక్రియ సజావుగా సాగి ఎక్కువ పాట పాడే వారికి టెండర్ దక్కే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు ఆలయం వద్ద వేలం

కొండపోచమ్మ ఆలయం వద్ద శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు. ఆలయం వద్ద 11 అంశాలకు సంబంధించిన వాటికి వేలం జరుగుతుందని, పాల్గొనేవారు ముందుగానే డిపాజిట్ చెల్లించాలని సూచించారు.



ఇథనాల్ ఫ్యాక్టరీ విషయాన్ని
ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

- గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- మల్లన్న నిర్వాసితులకు అండగా నిలుస్తాం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

7

డెలివర్రీ

వంటగ్యాస్ సరఫరాలో జాప్యం

- బుక్‌చేసి 15 రోజులైనా అందని గ్యాస్ సిలిండర్లు
- వినియోగదారుల ఖాతాల్లోకి చేరని సబ్సిడీ డబ్బు

జహీరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వంటగ్యాస్ కొరతతో వినియోగదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్యాస్ బుక్‌చేసి 15 రోజులు గడిచినా సంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల డెలివరీ చేయడం లేదు. ఆయా ప్రాంతాల్లో గ్యాస్ డెలివరీ వాహనాలు, సరఫరా చేసే వారి కోసం నిరీక్షించక తప్పడం లేదు. సకాలంలో ఇంటికి గ్యాస్ రాకపోవడంతో పల్లెల్లో కట్టెల పొయ్యిలను వినియోగించక తప్పడం లేదు. పట్టణాల్లో పక్కవారు, తెలిసిన వారి వద్ద అరువుగా తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండేసీ సార్లు బుక్‌చేసిన వంటగ్యాస్ రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఏజెన్సీల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం మూలంగానే ఇలా జరుగుతుందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గంలో లక్షకుపైచిలుకు గ్యాస్‌కనెక్షన్లు

నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు వంటగ్యాస్‌ను అందించేందుకు వీలుగా భారత్, ఇండియన్, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలున్నాయి. ఆయా మండలాల పరిధిలో సుమారు లక్షకుపైచిలుకు వంటగ్యాస్ కనెక్షన్‌లుండగా సగటున ప్రతిరోజు ఆయా ఏజెన్సీల నిర్వాహకులు సుమారు వెయ్యికిపైగానే సరఫరా చేస్తున్నారు. గ్యాస్‌కు డిమాండ్ అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగా ఏజెన్సీలు పనిచేయడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఆయా ఏజెన్సీల్లో వాహనాలు, సిబ్బంది కొరత, చిన్న చితక సమస్యలతో వెరసి సకాలంలో వంటగ్యాస్‌ను వినియోగదారులకు చేరవేయలేని పరిస్థితి ఏర్పడింది.తాము సకాంలోనే అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అలా లేవు.

కంపెనీల నుంచే ఆలస్యంగా..

కంపనీల నుంచే గ్యాస్ బండలు ఆలస్యంగా వస్తున్నాయంటూ ఏజెన్సీల నిర్వాహకులు, అందులో పనిచేసే ఉద్యోగులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో గ్యాస్‌ను బుక్ చేసిన వినియోగదారులు సమీపాల్లోని ఏజెన్సీ కార్యాలయాల వద్దకు, గోదాములకు వద్దకు చేరుకుని గొడవలు పడాల్సిన పరిస్థితి స్థానికంగా ఏర్పడింది. మారుమూల గ్రామాల్లో ఉండి గ్యాస్ బుక్ చేసుకున్న వారు, కిలోమీటర్ల దూరంలోని ఆయా ఏజెన్సీల చుట్టు తిరుగాల్సి వస్తుంది. దీంతో వినియోగదారుల సమయం, డబ్బు వృథా అవుతుంది. టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్ల వారు వాణిజ్య సిలిండర్లనే వాడాల్సి ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల వంటగ్యాస్ ఉన్న వారితో బుక్ చేయించుకుని వాటినే వినియోగిస్తున్నారని, దీని వల్ల గ్యాస్ కొరత ఏర్పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.


పట్టణంలోని ఓ ఏజెన్సీ వద్ద గ్యాస్ కోసం వేచిచూస్తున్న వినియోగదారులు

పరిహారం ఏది?

నియోజకవర్గంలోని చీలమామిడి, కొత్తూర్(బి), జహీరాబాద్ పట్టణంలోని ఫయ్యాజ్‌నగర్, మానిక్‌ప్రభుమహేశా, మూసానగర్, ఎన్జీవోస్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కొన్నాళ్లక్రితం సిలిండర్లు పేలి వినియోగదారులు గాయాలకు గురై మృత్యువాత పడ్డారు. వారికి పరిహారం ఇవ్వడంలో ఆయా కంపెనీలు విఫలమయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రభుత్వం సిలిండర్‌ను రూ.500లకే ఇస్తామని చెప్పినప్పటికి ఆచరణలో సాధ్యంకావడం లేదు. సబ్సిడీ నగదు ఖాతాల్లోకి చేరడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

సిలిండర్‌పై అదనపు వసూళ్లు

వంటగ్యాస్‌కు రూ.975 కాగా అదనంగా మరో రూ.30-50ని డెలివరీ బాయ్స్ వసూలు చేస్తూనే ఉన్నారు. వంటగ్యాస్‌ను 15 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేయడానికి వీలు లేదు. 15 కిలోమీటర్లు దాటితే వినియోగదారుడి సంతోషం మేరకు ఎంతోకొంత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, గ్యాస్‌ను మొబైల్ ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్ నంబర్ ద్వారా బుక్ చేశాక, మరుసటి రోజు లేదా రెండు రోజుల్లో సిలిండర్‌ను ఏజెన్సీల నిర్వాహకులు ఇంటింటికి పంపించాల్సి ఉంటుంది. అలాగే వారానికో గ్రామం చొప్పున ఏజెన్సీల నిర్వాహకులు తేదీలను నిర్ణయించుకుని గ్యాస్‌ను ఆయా ప్రాంతాలకు పంపిస్తుంటారు. బుక్ చేసిన 15 రోజుల వరకు గ్యాస్ అందడం లేదంటే జహీరాబాద్ ప్రాంతంలో వంటగ్యాస్ సరఫరా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సబ్సిడీ జమ కావడం లేదు

ఓవైపు గ్యాస్ సక్రమంగా రావడంలేదు. మరోవైపు సబ్సిడీ ఇవ్వడం లేదు. బుక్ చేసి 15 రోజులైనా డెలివరీ చేయలేదు. గ్యాస్ సిలిండర్‌ను రూ.975కు కొనుగోలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ ఖాతాలో జమకావడం లేదు. ఏజెన్సీ కార్యాలయంలో సబ్సిడీ అడిగితే అది మాకు సంబంధం లేదంటున్నారు. బ్యాంకుల్లో అధికారులను అడగండి అంటూ సమాధానమిస్తున్నారు.

\- రఘుపతి, బాబుమోహన్‌కాలనీ, జహీరాబాద్

చర్యలు తీసుకుంటాం

వినియోగదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటాం. బుక్‌చేసిన వెంటనే గ్యాస్‌ను అందజేసేందుకు ఏజెన్సీల నిర్వాహకులు కృషిచేయాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ హెచ్చరిస్తున్నాం మరీ మొండికేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఏజెన్సీల నిర్వాహకులు చూసుకోవాలి.

\- బస్వరాజ్, సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్

జీవవైవిధ్య విధానంతోనే ప్రజారోగ్యం

డీడీఎస్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ లయ

ఝరాసంగం,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జీవవైవిధ్యంతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డీడీఎస్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ లయ పేర్కొన్నారు. గురువారం మండలపరిధిలోని కస్తూర్బా, కుప్పానగర్ తదితర పాఠశాలల్లో డీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవైవిధ్యంపై క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్


సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 19 : వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. పాశమైలారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద కూడలిలో సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని పరిశ్రమలకు సంబంధించిన యాజమాన్యాలు సొసైటీలో సభ్యులుగా చేరాలని సూచించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

మనోహరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో తెలంగాణ బాలబాలికల జట్టుకు మెదక్ జిల్లా నుంచి 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కోడిప్యాక నారాయణగుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 24 వరకు జమ్మూ కశ్మీర్‌లో జరిగే ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం నుంచి 32 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. వారిలో జిల్లా నుంచి కార్తీక, శ్రీకృతి, శిరీష, గీతిక, విజయ్, శ్రీవాత్సవ, వరుణ్, నిషాంత్‌ను ఎంపిక చేశారని తెలిపారు.

కిక్‌బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయికి ప్రణతి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో కొనసాగుతున్న సీఎం కప్ కిక్ బాక్సింగ్ పోటీల్లో కొండాపూర్ మండలం తేర్పోల్‌కు చెందిన ప్రణతి గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లా స్థాయిలో జరిగిన కిక్‌బాక్సింగ్ రెండో రౌండ్‌లో ప్రణతి ప్రతిభ కనబరచగా రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ప్రణతిని డీవైఎస్‌వో ఖాసీంబేగ్, మాస్టర్ పోచయ్య, తల్లిదండ్రులు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లా హాకీ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా హాకీ క్రీడా ఎంపికలు ఈ నెల 21న బీహెచ్‌ఈఎల్ హాకీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో ఖాసీంబేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి సీఎం కప్ హాకీ క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

22న ఖోఖో ఉమ్మడి జిల్లా సీనియర్స్ జట్టు ఎంపిక

నర్సాపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో సీనియర్స్ జట్టు ఎంపికను 22న నర్సాపూర్‌లోని గిరిజన గురుకులంలో నిర్వహిస్తున్నట్లు హెచ్‌వోసీ ఏడీ మహేందర్‌రావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికైన జట్టు వచ్చే జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించే 57వ రాష్ట్ర స్థాయిపోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డుతో ఉదయం 9గంటల వరకు గిరిజన గురుకులానికి చేరుకోవాలని సూచించారు.

గణిత శాస్త్ర రాష్ట్రస్థాయి సెమినార్‌కు సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయులు

కొండపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గణిత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఈఆర్‌టి) నిర్వహించే సెమినార్‌కు సిద్దిపేట జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. 21న హైదరాబాద్‌లో జరిగే సెమినార్‌లో రాష్ట్రం నుంచి 31 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా అందులో ముగ్గురు ఉపాధ్యాయులు సిద్దిపేట జిల్లాకు చెందినవారు ఉన్నారు. పీవీ సత్యకుమార్(పెద్దమాసాన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల), ప్రదీప్‌కుమార్ (సంగుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల), వి.అజయ్‌కుమార్(కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల) సెమినార్‌కు ఎంపికయ్యారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్లు అభినందనలు తెలిపారు.

నేడు దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం


మెదక్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల కోసం శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణిలో ఇచ్చిన హామీ మేరకు శిబిరాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పలువురు స్పెషలిస్ట్ వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పథకాలు దూరం

- వాపోతున్న వెల్దుర్తికి చెందిన మహిళ


ప్రమీల

వెల్దుర్తి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యాయని వెల్దుర్తికి చెందిన మహిళ వాపోతుంది. పట్టణానికి చెందిన కిచ్చుగారి ప్రమీల భర్త నర్సింలు కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. ఇద్దరు కూతుళ్ల వివాహాలు కావడంతో, ప్రమీల ఒంటరిగా ఒకే గదిలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ప్రభుత్వం ప్రజాపాలనలో గృహలక్ష్మీ, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మీ పథకం, గ్యాస్ రాయితీల అమలు కోసం దరఖాస్తు చేసుకుని రశీదును తీసుకుంది. కానీ ఏ పథకం ఆమెకు వర్తించడం లేదు. ఇప్పటికే అమలవుతున్న గృహజ్యోతి పథకం కూడా అమలు కాకపోవడంతో నెలనెలా కరెంట్ బిల్లులను చెల్లిస్తుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే జాబితాలో సైతం ప్రమీల పేరు రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తుంది. అన్ని అర్హతలు ఉండి ఒంటరి మహిళనైన తనకు అధికారుల తప్పుతో ప్రభుత్వ పథకాలు దూరం అవుతున్నాయని, పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతుంది.


ప్రజాపాలన దరఖాస్తు రశీదు

క్రైం కార్నర్

బిల్డింగ్‌పై నుంచి పడి ఒకరి మృతి


అజీముద్దీన్(ఫైల్)

చిన్నకోడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్ బాల్కనీ నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలై ఒకరు మృతిచెందిన సంఘటన చిన్నకోడూరులో గురువారం జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు గ్రామానికి చెందిన మహమ్మద్ అజీముద్దీన్(47) బతుకుదెరువు కోసం ఏడాదిన్నర క్రితం కువైట్‌కు వెళ్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం తెల్లవారుజామున అజీముద్దీన్ కువైట్ నుంచి గ్రామంలోని ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటికి అతడే బాత్‌రూంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్ బాల్కనీ నుంచి కింద పడటంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అజీముద్దీన్‌కు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య హాజీర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు..

దుబ్బాక, డిసెంబరు 19 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి దుబ్బాక మండల పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శిలాజీనగర్‌కు చెందిన పెంబర్తి రాకేష్(24) గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటికి మట్టిని తరలిస్తున్నాడు. సదరు ఇంటి వద్ద ట్రాక్టర్‌ను నిలిపాడు. ట్రాక్టర్ ఇంజన్ ఆఫ్ చేయకపోవడంతో ఒక్కసారిగా ముందుకు కదలడంతో రాకేష్ గమనించి ఇంజన్ ఆఫ్ చేసేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో కాలు జారీ ట్రాక్టర్ చక్రాల కింద పడ్డాడు. వెంటనే స్థానికులు దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు యువకుడు మృతిచెందినట్టు తెలిపారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దుబ్బాక ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని యశ్వంతరావుపేట చౌరస్తా వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన బ్యాగరీ కళావతి, శ్రీనివాస్ కుమారుడు బ్యాగరీ వంశీ(14) మంగళపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం ఇంటికి వస్తుండగా యశ్వంతరావుపేట చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న అతడిని నర్సాపూర్ వైపు నుంచి వెల్దుర్తి వైపు వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో వంశీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై వెల్దుర్తి ఎస్ఐ రాజును సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

చెరకు తోట దగ్ధం

- ఎనిమిది ఎకరాలకు మంటలు
- రూ.6 లక్షలు నష్టం


దగ్ధమైన తోట

హవేళిఘణపూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధమైన ఘటన మండలంలోని బొగుడ భూపతిపూర్ శివారులో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొగుడభూపతిపూర్ గ్రామానికి చెందిన రైతులు మంద సాయిలు చెరకు తోటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు రేగాయి. దీంతో సమీప రైతుల రమేష్, సంజీవులు, నర్సింలు, నాజీల చెరకు తోటలకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. 8 ఎకరాల్లోని పంట దగ్ధమైంది. రూ.6లక్షల వరకు పంట నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

సిరిసినగండ్లలో ఆటో..


కాలిపోయిన ఆటో

కొండపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఆటోకు నిప్పంటించడంతో దగ్ధమైన సంఘటన కొండపాక మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. మండలంలోని సిరిసినగండ్ల గ్రామానికి చెందిన ఎర్రవల్లి సాయిబాబా తన ఆటోను రోజు మాదిరిగా బుధవారం రాత్రి ఇంటిముందు నిలిపి పడుకున్నాడు. తిరిగి గురువారం ఉదయం చూసేసరికి ఆటో కాలిపోయిఉన్నది. ఎవరో గుర్తుతెలియ వ్యక్తులు దగ్ధం చేశారని రూ.1.50 లక్షలు నష్టం జరిగిందని బాధితుడు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


బతుకమ్మ సంబరాల్లో పిల్లలతో గేయాలను ఆలపింపజేస్తున్న విస్సా సత్యసాయి


సినారె నుంచి పురస్కారం అందుకుంటున్న సత్యసాయి(ఫైల్)

కళా క్షేత్రం..‘విస్సా నిలయం’

సాంస్కృతిక వైభవానికి కృషి చేస్తున్న ఆయుధ కర్మాగారం ఉద్యోగి

లలిత కళలు, భాషా, శ్లోకాలు, సంగీతం, నృత్యంలో చిన్నారులకు తర్ఫీదు

తెలుగు-వెలుగు పేరుతో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ


ఆయుధ కర్మాగారంలో చిన్నారులకు శ్లోకాలను నేర్పిస్తున్న సత్యసాయి


విస్సా నిలయం ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్యం

కంది, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో లలిత కళలు, శాస్త్రీయ సంగీతం, నృత్యం, భక్తి గీతాల ఆలాపన తదితర కళలకు ఆదరణ కరువైపోతుంది. సెల్‌ఫోన్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్‌మీడియాలో రీల్స్ అంటూ యువతతో పాటు చిన్నారులు కాలక్షేపం చేస్తున్నారు. పిల్లలకు సాంకేతిక అంశాలను నేర్పించేందుకు శ్రద్ధ చూపుతున్న తల్లిదండ్రులు సంప్రదాయ కళల వైపు చూడడం లేదు. ఇలాంటి అంతరించిపోతున్న కళలను వెలుగులోకి తెచ్చేందుకు సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధి ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం ఉద్యోగి సత్యసాయి తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. ఆయన ఇంటి పేరుతో స్థాపించిన విస్సా నిలయం ద్వారా కృషి చేస్తున్నారు.

ఉద్యోగం చేస్తూనే..

తూర్పు గోదావరి ప్రాంతానికి చెందిన విస్సా సత్యసాయి ఆయుధ కర్మాగారంలో విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు తన తాత ముత్తాతల కాలంలో స్థాపించిన విస్సా నిలయం ఫౌండేషన్ ద్వారా సంస్కృతి పరిరక్షణకు పాటుపడుతున్నారు. విద్యార్థులకు ఉచితంగా లలిత కళలు, ఆధ్యాత్మిక శ్లోకాలు వల్లించడంలో తర్ఫీదు ఇస్తున్నారు. ఆయుధ కర్మాగారంలోని ఆహ్లాదకరమైన వాతావరణంలో తన భార్యతో కలిసి స్వయంగా ఆయనే చిన్నారులకు శ్లోకాలను నేర్పిస్తారు. 20 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ సంగీతంపై ప్రేరణ కలిగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో పాఠశాలల్లో మోటివేషనల్ క్లాసులు తీసుకుని విద్యార్థుల్లో మార్పు తీసుకొంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు భరతనాట్యం, గేయాలు, రచనలు, తెలుగు భాషపై పట్టు సాధించడానికి దోహదపడుతున్నారు. సత్యసాయి తెలుగు-వెలుగు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థులకు చదువు ఒక్కటే సరిపోదని, అన్నిటికంటే ముఖ్యంగా క్రమశిక్షణ, సంస్కృతీసంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంచాలని ఆయన తల్లిదండ్రుల్లోకి ఆయన భావాలను తీసుకెళుతున్నారు. సత్యసాయి సేవలకు గాను డాక్టర్ సినారె నుంచి పురస్కారాన్ని అందుకున్నారు.

పత్తి రైతులకు గిట్టుబాటు ధర లేదు

- కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరాజ్‌సింగ్‌కు జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ వినతి

నారాయణఖేడ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : పత్తికి ప్రస్తుతం మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తున్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరాజ్‌సింగ్‌కు విన్నవించారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన గురువారం కేంద్ర మంత్రి విన్నవించారు. వాతావరణంలో నెలకొన్న మార్పులతో అధిక తేమను సాకుగా చూపి కొనుగోలుదారులు రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.200ల వరకు తక్కువగా చెల్లిస్తున్నారని వివరించారు. పత్తిపంటలో దిగుబడి కూడా తగ్గిందని, ఎకరాకు 8 క్వింటాళ్లు మాత్రమే వస్తుందని తెలిపారు. ఎకరాకు రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టారని, అటు దిగుబడి లేక, ఇటు మద్దతు ధర లభించక పత్తి రైతులు నష్ట పోతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించి, పూర్తి మద్దతు ధర దక్కేలా చర్యలు చేపట్టాలని మంత్రిని ఎంపీ కోరారు.


కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్

నవోదయ విద్యాలయాన్ని ఖేడ్‌లోనే ఏర్పాటు చేయాలి

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న నవోదయ విద్యాలయాన్ని నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ కేంద్ర విద్యా శాఖ మంత్రి జయంత్‌చౌదరిని గురువారం కలిసి వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సంగారెడ్డి జిల్లాకు నవోదయ పాఠశాలను మంజూరు చేసిందని, తమ జహీరాబాద్ పార్లమెంట్ పరిధి సంగారెడ్డి జిల్లాలోనూ ఉన్నందున.. సెగ్మెంట్‌లోని నారాయణఖేడ్‌లో విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో నారాయణఖేడ్ నియోజకవర్గం ఉన్నందున ఈ ప్రాంతంలో పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని తెలిపారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


గుగ్గిళ్లలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

బెజ్జంకి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమీపంలో పరిశ్రమలు నిర్మించడం సరైంది కాదని, ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతుల రద్దు చేయాలని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని సీపీఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి రైతులు, గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలు రద్దు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గ్రామస్థులు నిర్వహిస్తున్న ఉద్యమాలకు సీపీఐ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ఉద్యమం ఉధృతం కాకముందే పరిశ్రమను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, మండల కార్యదర్శి రూపేష్ తదితరులు ఉన్నారు.

గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి

హుస్నాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకుస్థాపన చేసి 32 ఏళ్లు గడిచినా పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. మరో రూ.247 కోట్లు మంజూరు చేసినట్లయితూ వరద కాలువకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

నిర్వాసితులకు అండగా నిలుస్తాం


గజ్వేల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు అండగా నిలుస్తామని సీపీఎం జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి భూనిర్వాసితుల సమస్యలపై చర్చించారు. ఆయనవెంట సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ, నిర్వాసితులు పోచయ్య, రమేశ్, కనకయ్య, బాలయ్య తదితరులున్నారు.


దైవదర్శనానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

- మధురైలో జగదేవ్‌పూర్‌వాసి గుండెపోటుతో మృతి

జగదేవ్‌పూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా.. గుండెపోటుతో జిల్లాకు చెందిన ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్‌కు చెందిన పనగట్ల నగేష్(48) తన మిత్రులతో కలిసి 15న శబరిమలై బయలుదేరి వెళ్లాడు. అక్కడ దర్శనం చేసుకున్న అనంతరం బుధవారం తమిళనాడులోని మధురై చేరుకుని మీనాక్షి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. రాత్రి అక్కడే ఉండి ఉదయం రామేశ్వరం వెళ్లాలనుకోగా, గురువారం తెల్లవారుజామున బాత్‌రూమ్ వెళ్లి వచ్చిన నగేష్ ఒక్కసారిగా బెడ్‌పై పడిపోవడంతో గమనించిన స్నేహితులు వెంటనే అతనిని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని హైదరాబాద్ తీసుకువస్తున్నారు.

బండరాళ్లు.. అపురూపాలు





హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులో ప్రకృతి రూపుదిద్దిన ఆకృతితో ఉన్న బండరాళ్లు చూడచక్కగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. వాటి ఆకారానికి అనుగుణంగా గ్రామస్థులు ఒక్కో గుండును ఒక్కో పేరుతో పిలుస్తారు. పొడవైన మూతి రూపం కలిగి తన కాళ్లపై గద్ద రూపంలో కూర్చుని ఉన్నట్టు కనిపిస్తున్న గుండును గద్ద గుండు అని, గొడుగులాగా ఎండ వాన నుంచి గతంలో వడ్రంగి వృత్తులు చేసే వారికి రక్షణగా ఉన్న గుండును ఒడ్లోని గుండు అని పిలుస్తుంటారు.

- హత్నూర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

విద్యాశాఖలో స్తంభించిన సేవలు!

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెతో తీవ్ర ప్రభావం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో అనుబంధంగా పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో విద్యావ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌ల వద్ద 4 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఓవైపు మండల వనరుల కేంద్రాల(ఎంఆర్‌సీ-ఎంఈవో)తో పాటు, కేజీబీవీ, యూఆర్ఎస్‌లో విద్యాబోధన నిలిచిపోయింది. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అందించే నివేదికలు నిలిచిపోయాయి. సమాచారం అందకపోవడంతో విద్యాశాఖ అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు

సంగారెడ్డి జిల్లాలో 686 మంది

సమగ్ర శిక్షా అభియాన్ కింద జిల్లాలో 686 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో డీపీవో స్టాఫ్-10 మంది, కేజీబీవీల్లో-324 మంది,(అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్) యూఆర్ఎస్ -13 మంది, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు-19 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు-23 మంది, ఐఈఆర్‌పీలు-34 మంది, సీఆర్పీలు-111, మెసెంజర్లు-17, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు(పీటీఐలు)-103, సీజీవీఎస్(కేర్ గివర్ వలంటీర్స్)-24 మంది పనిచేస్తున్నారు.

బోధనపై ప్రభావం

సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ పరిధిలో 85 క్లస్టర్లు ఉండగా, అందులో 111 మంది సీఆర్‌పీలు పనిచేస్తున్నారు. వీరిని కాంప్లెక్స్ స్కూళ్లకు కేటాయించారు. ఒక్కో సీఆర్‌పీ వారి క్లస్టర్ పరిధిలోని ఒకటి లేదా రెండు పాఠశాలలను సందర్శించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాల సమచారాన్ని పరిశీలిస్తుంటారు. పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూడైస్‌లో నమోదు చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవుల్లో వెళ్తే ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్‌పీ ఆ పాఠశాలకు వెళ్లి నడిపిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం, పాఠశాల ఖర్చుల వివరాలు సేకరించి విద్యాశాఖాధికారులకు అందజేస్తారు. సమ్మెతో అవేమీ జరగడం లేదు. 12 నుంచి జరగాల్సిన బడి బయటి పిల్లల సర్వే ప్రారంభం కాలేదు. భవిత కేంద్రాల్లో పనిచేసే ఐఈఆర్‌పీలు సమ్మెలో ఉండడంతో దివ్యాంగ విద్యార్థులకు బోధన నిలిచిపోయింది. ఎంఈవో, సమగ్ర శిక్షా కార్యాలయాల్లో సేవలు పూర్తిగా నిలిచివడంతో బడ్జెట్, మెడికల్ రియాంబర్స్‌మెంట్ బిల్లుల ఫైళ్లు కదలడం లేదు. కేజీబీవీల్లోనూ బోధన అటకెక్కింది. ఓవైపు పదో తరగతి సిలబస్ ఈనెల చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో నిలిచిన బోధనతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ ప్రభావం వార్షిక పరీక్షల ఫలితాలపై పడే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద బతుకమ్మతో సీఆర్‌పీలు

13వ రోజుకు చేరిన సమ్మె

సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరింది. గురువారం బతుకమ్మ ఆడుతూ వారు నిరసన తెలిపారు. సమ్మెకు టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్యయాదవ్ సంఘీభావం తెలిపారు.



సమగ్ర శిక్షా ఉద్యోగుల ఆధ్వర్యంలో సిద్దిపేటలో భారీ ర్యాలీ

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు గురువారం సిద్దిపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ హనుమకొండలో తమకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి సంవత్సరం గడుస్తున్నా నెరవేర్చడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. చాయ్ తాగినంతలో సమస్యను పరిష్కరిస్తామని సంవత్సర కాలంగా పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ..



స్టేషన్‌లోని పరిసరాలను పరిశీలిస్తున్న ఏసీపీ

బెజ్జంకి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను సిద్దిపేట ఏసీపీ మధు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనితీరుపై పోలీస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని పరిసరాలను పరిశీలించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ శంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

'టీచర్లకు పదోన్నతి కల్పించాలి'

మిరుదొడ్డి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఖాళీలకు అనుగుణంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్ డిమాండ్ చేశారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు భూపాల్, నాయకులు రాజేశం, జాన్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి





కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. గురువారం జిల్లాలో పనిచేస్తున్న వైద్యాధికారులకు జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అన్నిరకాల ఆరోగ్య కార్యక్రమాల సేవలు, పనితీరుపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అంధత్వ నివారణ కోసం శంకర ఐ హాస్పిటల్ హైదరాబాద్‌లో పనిచేస్తుందన్నారు. జిల్లాలో అంధత్వ నివారణ కోసం చేపట్టే కార్యక్రమంలో భాగంగా జిల్లా లోని 26 మండలాల్లో శంకర ఐ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించనున్నట్టు తెలిపారు. సుమారు 3,750 మంది క్యాటరాక్ట్ సర్జరీలు అవసరమని, వీరందరికీ సర్జరీలు నిర్వహించేందుకు ప్రతి మండలంలో క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్టు వివరించారు. ప్రతీ గురువారం మండలంలో ఒక ప్రాంతంలో క్యాంపు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఓపీ/ఐపీ సంఖ్య పెంచాలనీ, పిల్లలకు, గర్భిణులకు వందశాతం టీకాలు అందేవిధంగా చూడాలని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 85 శాతం ఓపీ ఉందని, 70 శాతం గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దృష్టి సారించి మరింత ఓపీని పెంచాలని, ఈ-సంజీవనిలో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వెనకబడి ఉన్నాయని వాటి పైన దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. మాతా శిశు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా తల్లి బిడ్డల పైన ప్రత్యేకమైన శ్రద్ధ వహించి సేవలు అందించాలని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, ఆరోగ్య మహిళా క్లినిక్ల ద్వారా ప్రతీ మంగళవారం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చిన మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్, జిల్లా వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో మున్సిఫ్‌కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి

● ఈ నెల 29న ప్రారంభానికి చర్యలు

చేర్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మున్సిఫ్ కోర్టు భవనాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ మనుచౌదరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి పరిశీలించారు. ఈ నెల 29న కోర్టు భవనం ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయా పనులను పరిశీలించారు. ఇంకా చేపట్టాల్సిన పనులు, వసతుల కల్పనకు సంబంధించి ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు సూచనలు చేశారు. కాగా సుమారు ఏడాదిన్నర క్రితం చేర్యాలకు మున్సిఫ్ కోర్టు మంజూరు చేసినప్పటికీ సిబ్బంది నియామకంలో జాప్యం జరిగింది. కొద్దిరోజులక్రితమే 27మందిని నియమిస్తూ చర్యలు తీసుకున్న క్రమంలో కోర్టుసేవల ప్రారంభానికి సన్నాహాలు ప్రారంభించారు.



కోర్టుహాలును పరిశీలిస్తున్న న్యాయమూర్తి సాయి రమాదేవి

ఎడ్యూకేషన్ హబ్‌లో సమస్యలు పరిష్కరించండి

● కలెక్టర్‌ను కోరిన ప్రిన్సిపాళ్లు

గజ్వేల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ బాలుర ఎడ్యూకేషన్‌హబ్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనూచౌదరిని గజ్వేల్ బాలుర ఎడ్యూకేషన్‌హబ్‌లోని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోరారు. ఈ మేరకు సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయాలని, బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని, కంపౌండ్ వాల్ ఎత్తును పెంచాలని, హాస్టల్ విద్యార్థుల సీట్లను పెంచాలని, హబ్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని, సమయానికి అనుగుణంగా బస్సులను నడిపించాలని కోరారు. అనంతరం గజ్వేల్ మునిసిపల్ ఛైర్మన్ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్యను కలసి వినతిపత్రాన్ని అంజేశారు. వినతిపత్రం సమర్పించినవారిలో ప్రిన్సిపాళ్లు నిఖత్ అంజూమ్, కృష్ణారావు, శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, హాస్టల్ ఆఫీసర్లు కవిత, దేవదాసు ఉన్నారు.

చెస్ పోటీల్లో సత్తా చాటాలి



మీడియాతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి

గజ్వేల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ విద్యార్థులు చెస్ పోటీలో సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో రాణించాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాస్థాయి సీఎం చెస్ టోర్నమెంట్‌ను గజ్వేల్ చెస్ క్లబ్, సౌజన్యంతో గజ్వేల్‌లోని ఐవోసీలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైరన్ మాట్లాడుతూ చెస్ పోటీలో పాల్గొంటున్న విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం చెస్ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన సుశాంత్, చిద్విలాస్, వర్ణిక, మాధవి, విద్యార్థులకు ఆర్వీవో చంద్రకళ బహుమతులను విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్, చెస్ అసోయేషన్ సిద్దిపేట ఇన్‌చార్జి ఎలియాస్ రావు, పీడీఎస్ నగేష్, భవిత, రేఖ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

● అంబేడ్కర్‌ను అవమానించారంటూ దిష్టిబొమ్మల దహనం



సిద్దిపేట మోడల్ బస్టాండ్ వద్ద అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్/సిద్దిపేట అర్బన్/సిద్దిపేట రూరల్/సిద్దిపేట క్రైం/నంగనూరు/దౌల్తాబాద్/చేర్యాల/దుబ్బాక/మిరుదొడ్డి/హుస్నాబాద్ టౌన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. సిద్దిపేట పట్టణంలోని మోడల్ బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షా ఫెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మాట్లాడుతూ.. వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను బీజేపీ అవమాన పరిచిందని మండిపడ్డారు. కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మాల సదర్ సంఘం నాయకులు సిద్దిపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతూ.. భారత రాజ్యాంగ నిర్మాతపై అమిత్ షా అనుచితంగా మాట్లాడటం సరైనది కాదని మండిపడ్డారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల అధ్యక్షుడు చేగురి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ సిద్దిపేట కమిటీ ఆధ్వర్యంలో కోర్టు నుంచి అంబేడ్కర్ చమాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన నిరసన కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు ఆధ్వర్యంలో నంగునూరులో కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ నంగనూరులో విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తితోనే అమిత్‌షా కేంద్ర హోంమంత్రి అయ్యారనే విషయాన్ని మర్చిపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ దౌల్తాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు విలేకరులతో మాట్లాడుతూ.. అమిత్‌షా అంబేద్కర్ ను అవమాన పరిచిన తీరు యావత్ సమాజం తలదించుకునేలా ఉందన్నారు. చేర్యాల గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మ దహనం చేశారు. అలాగే స్థానిక పాత బస్టాండుతో పాటు గుర్జకుంట గ్రామంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కులవివక్ష పోరాట సమితి నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. దుబ్బాక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో, మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో వేర్వేరుగా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై

రైతులకు అవగాహన



జగదేవ్‌పూర్‌లో ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న డీఏవో

జగదేవ్‌పూర్/చిన్నకోడూరు/చేర్యాల/మిరుదొడ్డి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ పేర్కొన్నారు. గురువారం జగదేవ్‌పూర్ రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటి వరకు 12 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 50వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సాగుకు జిల్లాలోని రైతులు ముందుకు రావాలని సూచించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ ఇండస్ట్రీ జూన్ నెలలో ప్రారంభమవుతుందని, ప్రారంభం నాటికి 20వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జగదేవ్‌పూర్‌కు చెందిన రైతు బాల్‌రెడ్డి సాగు చేసిన ఆయిల్‌పామ్ పంటను పరిశీలించారు. చిన్నకోడూరు మండలంలోని అనంతసాగర్‌లో సిద్దిపేట ఏడీఏ పద్మ ఆయిల్ పామ్‌సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పంట సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. కొమురవెల్లి మండలానికి చెందిన పలువురు రైతులకు గురువారం చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై కొమురవెల్లి మండల వ్యవసాయాధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉద్యానవనశాఖాధికారి కౌసల్య తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామంలో మిరుదొడ్డి మండల వ్యవసాధికారి మల్లేశం ఉద్యానవన శాఖ, ఆయిల్‌పెడ్‌శాఖల అధికారులతో కలిసి ఆయిల్‌పాం తోటను పరిశీలించారు. ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం మొక్కలపై, డ్రిప్ పరికరాలకు సబ్సిడీని అందజేస్తుందన్నారు.

రేవంత్ పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదు

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో అవినీతి తప్ప ఎక్కడాఅభివృద్ధి దాఖలాలు కనిపించడంలేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అప్పులు తెచ్చుకోవడానికి తెలంగాణలో టాస్క్ ఫోర్స్ కమిటీ వేయడం సిగ్గుచేటన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో 50 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఇవ్వనందుకు లగిచర్ల రైతుల చేతులకు సంకెళ్లు వేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్ రెడ్డి,విద్యాసాగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్ రెడ్డి, కోడూరి నరేష్, గోనె మార్కండేయులు, లక్కిరెడ్డి తిరుమల, ఉమా సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండపాకలో సీఎం కప్ బాక్సింగ్ పోటీలు

కొండపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా కొండపాక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మూడు జిల్లాలకు చెందిన యువతీ యువకులకు బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సముద్రాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీ నర్రా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ మున్సిపాలిటీకి 'చేంజ్‌మేకర్స్' అవార్డు



చేంజ్‌మేకర్స్ అవార్డును అందుకుంటున్న హుస్నాబాద్ మున్సిపల్ అధికారి రవికుమార్

హుస్నాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 2021 నుంచి 2024 వరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ప్రదర్శన, చెత్తతో నూతన వస్తువుల తయారు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హుస్నాబాద్ మున్సిపాలిటీకి గురువారం ఢిల్లీలోని సిల్వర్ హోక్‌హాల్‌లో చేంజ్ మేకర్స్ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డును సీఎస్‌ఈ డైరెక్టర్ డాక్టర్ సునీత చేతుల మీదుగా మున్సిపల్ ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్ అందుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల ఛైర్‌పర్సన్ ఆకుల రజిత హర్షం వ్యక్తం చేశారు.

మల్లుపల్లిలో 'రన్ ఫర్ యాంటీ డ్రగ్స్'

మిరుదొడ్డి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):విదేశాల్లోడ్రగ్ సంస్కృతి మన దేశంలోకి విస్తరించడం బాధాకరమని ఇక్రిశాట్ రిటైర్ శాస్త్రవేత్త హనుమంత రావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని మల్లుపల్లి గ్రామంలో రన్‌ఫర్ యాంటీడ్రగ్స్ కార్యక్రమంలో భాగంగా టూ కే రన్‌ను జెండాఊపి ప్రారంభించారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో రన్‌ఫర్ యాంటీ డ్రగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని అభినందించారు. కార్యక్రమంలో రన్‌ఫర్ యాంటిడ్రగ్స్ ఆర్గనైజర్ తోటకమలాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గుండెనొప్పితో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



ఏఆర్ కానిస్టేబుల్ రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ఏఆర్ హెడ్ క్వార్టర్లో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ డీవీఆర్ రాజు గురువారం ఉదయం గుండె నొప్పితో మృతి చెందాడు. పట్టణంలోని గణేష్ నగర్‌లో గల ఇంట్లో గుండెనొప్పితో కింద పడిపోగా కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుడు రాజుకు భార్య లావణ్య, కూతురు వసుధ, కొడుకు మణిశంకర్ రాజు ఉన్నారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి సంతాపం వ్యక్తం చేశారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ధరణి కుమార్, రాజేష్, ఆర్ఎస్ఐ నిరంజన్, పోలీస్ అధికారులు, సిబ్బంది రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి రాజు నివాసానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు, అంత్యక్రియల గురించి ప్రభుత్వం తరఫున రూ.30 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రాథమిక స్థాయిలోనే వ్యాధిని గుర్తిస్తే మేలు

కొండపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో గుండెకు సంబంధించిన వ్యాధితో ఎంతోమంది పిల్లలు మృత్యువాత పడుతున్నారని ప్రాథమిక స్థాయిలోనే వ్యాధిని గుర్తిస్తే ప్రమాదం తప్పించవచ్చని సత్యసాయి చైల్డ్ హార్ట్ కేర్ సెంటర్ ఛైర్మన్ సి. శ్రీనివాస్ అన్నారు. కొండపాక గ్రామంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు అధునాతన పరికరాలతో స్క్రీనింగ్ చేసే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వంద మంది పిల్లలకు హెచ్‌డీ స్టెత్‌తో ఉచితంగా పరీక్షలు చేశారు.

ఎస్ఐ జాన్ విల్సన్ ప్రజల హృదయాల్లో నిలిచారు

హుస్నాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామవరం వద్ద నక్సలైట్లు పేల్చిన మందు పాతర ఘటనలో అమరుడైన ఎస్ఐ జాన్ విల్సన్ హుస్నాబాద్ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత పేర్కొన్నారు. గురువారం ఆమె ఎస్ఐ జాన్ విల్సన్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి, సీఐ యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్‌విల్సన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బోయిని ఎల్లయ్య ఆధ్వర్యంలోపేద వృద్ధ మహిళలకు వస్త్రాలను పంపిణీ చేశారు.

వ్యవసాయశాఖ కమిషన్ ఛైర్మన్‌కు రైతుల వినతి

మద్దూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్మాముల గ్రామ ఆమ్లెట్ విలేజ్ గ్రామ రైతులు గురువారం హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో వ్యవసాయశాఖ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి భూ సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. రైతులు జంగిలి యాదగిరి, జంగిలి బిక్షపతి, రాసూరి ఉప్పలయ్య, గుడిసె యాదగిరి, మీస అంజనేయులు మాట్లాడారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా రిజిస్ట్రేషన్‌తో పాటు సాదాబైనామా కాగితాలతో భూములు కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న తమకు ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని కోరినట్లు తెలిపారు కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన వారిలో రైతు ఇప్ప నిశికాంత్ రెడ్డి, జంగిలి మల్లేశం, జంగిలి సాయిలు, రాసూరి ఉపేందర్, రాసూరి బీరయ్య, గుడిసె సత్తయ్య మీస సిద్దిలింగంతో పాటు పలువురు ఉన్నారు.

అసెంబ్లీ ముట్టడికి తరలి వెళ్తున్న నాయకుల ముందస్తు అరెస్టులు

సిద్దిపేట అర్బన్/చిన్నకోడూరు/నంగునూరు/దుబ్బాక/మిరుదొడ్డి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా నుంచి ముట్టడికి తరలి వెళ్తున్న నాయకులను గురువారం పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సిద్దిపేట నుంచి తరలి వెళ్తున్న మాల సంఘాల నాయకులు యాదగిరి, లింగం, మల్లేశం, శ్రీహరి, సత్తయ్య తదితరులను పోలీసులు అరెస్టు చేసి 3టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చిన్నకోడూరులో అరెస్టయిన వారిలో పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుడుమల్ల సత్తయ్య, జిల్లా కో కన్వీనర్ కటికం రవి, మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కడారి కనకయ్య తదితరులు ఉన్నారు. నంగునూరు మండలం నుంచి ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా మాల మానాడు జిల్లా కన్వీనర్ బాల పోచయ్య, నాయకులు అల్లిబిల్లి నర్సింగరావు, దాసరి రమేశ్, పులి రవి, జెల్ల మహేందర్, జజాల కనకరాజు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల నుంచి అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి స్థానిక స్టేషన్లకు తరలించారు.

జిల్లా ప్రజల అభివృద్ధికి రుణాలు అందించాలి



సీఎస్‌సీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల ఆర్థికాభివృద్ధికి రుణాలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ బ్యాంకర్లకు సూచించారు. గురువారం ఐడీవోసీ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ అధికారి హరిబాబు ఆధ్వర్యంలో డిస్ట్రిక్ లెవల్ బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకుల పనితీరు పై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజ్ రుణాల లక్ష్యం రూ. 895.69 కోట్లకు గాను రూ.643 కోట్ల రుణాలను అందించామని, మిగతా లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ జయదేవ్ ఆర్యా, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, జిల్లా పరిశ్రమల అధికారి గణేష్, నాబార్డ్ ఏజీఎం నిఖిల్, సీఎస్‌సీ కోర్డినేటర్ శ్రీనివాస్ వివిధ బ్యాంక్‌ల ఆర్ఎంలు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మనం టాప్‌టెన్‌లో ఉండాలి

సిద్దిపేట కల్చరల్: ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచి జిల్లాను టాప్ టెన్ లో ఉండేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు, ఫలితాలు, విద్యార్థుల ఒత్తిడి తదితర అంశాలపట్ల ఆయా విభాగాల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, వైద్య టాస్క్‌ఫోర్స్ విభాగాల బాధ్యులు సమావేశంలో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఈవో రవీందర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


మాకేది రక్షణ..?

(5వ పేజీ తరువాయి)

ధరిస్తున్నారు. ఇక చలికి వణుకుతూ పట్టణాలను పరిశుభ్రంగా మార్చుతున్నారు.

దాతలు ముందుకొచ్చేనా...

చలికాలంలో విద్యార్థులకు, అనాథలకు స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఈ పారిశుధ్య కార్మికులను సైతం ఆదుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది. ఆయా మున్సిపాలిటీల్లో గ్లౌజులు, బూట్లు, సేఫ్టీ అప్రాన్లు అందజేశారు. కానీ మెజారిటీ మున్సిపాలిటీల్లో మాత్రం ఇవ్వలేదు. ఇచ్చే పరిస్థితి కూడా లేదు. అందుకే పారిశుధ్య కార్మికుల కష్టాలు చూసైనా దాతలు స్పందించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందరి ఆరోగ్యం కోసం శ్రమించే తమ ఆరోగ్య రక్షణకు దాతలు ముందుకు రావాలని కార్మికులు కోరుతున్నారు.



చేర్యాలలో తెల్లవారుజామునే బూట్లు, గ్లౌజులు, స్వెటర్లు, లేకుండా విధుల్లోకి వచ్చిన కార్మికులు

ముగిసిన సీఎం కప్ క్రీడలు

సిద్దిపేట కల్చరల్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న సీఎం కప్- 2024 క్రీడలు గురువారం ముగిశాయి. 3 రోజులపాటు జరిగిన జిల్లాస్థాయి క్రీడపోటీల్లో 18 క్రీడాంశాల్లో క్రీడాకారులు పోటీపడ్డారు. పోటీలలో మూడోరోజు జరుగుతున్న ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడలను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ప్రారంభించారు. అనంతరం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ హాజరై క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు.క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. మూడు రోజులపాటు జరిగిన పలు క్రీడాంశాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాస్థాయిలో పోటీ పడి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జయదేవ్ ఆర్యా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, మద్దూరు మాజీ జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, ఎస్టీఎఫ్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి సౌందర్య, కౌన్సిలర్ శ్రీదేవి, పీఈటీలు పాల్గొన్నారు.





విజేత జట్టుకు బహుమతి ప్రదానోత్సవం, గొడవ పడుతున్న మద్దూరు, హుస్నాబాద్ కబడ్డీ క్రీడాకారులు

కబడ్డీ టీమ్‌ల మధ్య ఘర్షణ

పోటాపోటీగా జరిగిన కబడ్డీ పోటీల్లో మద్దూరు, హుస్నాబాద్ జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన తుదిపోరులో మద్దూరు జట్టు విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఇరుజట్ల సభ్యులు, అభిమానుల పరస్పర దూషణలు కాస్తా పెద్దవై గ్రౌండ్‌లో ఘర్షణకు దిగారు. కుర్చీలు విసురుకుని బాహాబాహీకి దిగారు. ఈ గొడవలో హుస్నాబాద్ జట్టుకు సంబంధించిన ఆటగాడికి తలకు గాయమైంది. అధికారులు, పోలీసులు కలుగజేసుకుని సర్దిచెప్పి అవార్డు ఫంక్షన్ పూర్తిచేశారు. కార్యక్రమం పూర్తయ్యాక ఇరుజట్ల సభ్యులు మరోసారి గొడవకు దిగారు. పోలీసులు వారిని అదుపు చేసి అక్కడ నుంచి పంపించివేశారు.

విజేతలు వీరే

పురుషుల విభాగం వాలీబాల్ పోటీల్లో కొండపాక జట్టు విజయం సాధించగా, రన్నర్స్‌గా నంగునూర్ మండలం జట్టు నిలిచింది. మహిళల విభాగంలో వాలీబాల్ గజ్వేల్ టీమ్ విన్నర్ కాగా రన్నర్‌గా కొండపాక జట్టు నిలిచాయి. ఖోఖో పురుషుల విభాగంలో సిద్దిపేట రూరల్ జట్టు విజయం సాధించగా గజ్వేల్ రూరల్ రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో ఉమెన్ విభాగంలో జగదేవ్‌పూర్ జట్టు విజయం సాధించగా, గజ్వేల్ జట్టు రన్నర్‌గా నిలిచింది.

కబడ్డీలో పురుషుల విభాగంలో మద్దూరు జట్టు విజయం సాధించగా, హుస్నాబాద్ రన్నర్‌గా నిలిచింది. కబడ్డీ ఉమెన్ విభాగంలో విన్నర్‌గా గజ్వేల్ టీమ్, రన్నర్‌గా దుబ్బాక జట్టు నిలిచాయి. ఇక అథ్లెటిక్స్‌లో మెన్, ఉమెన్ విభాగంలో సిద్దిపేట రూరల్ మండలం క్రీడాకారులు ఎంపికయ్యారు.